
కథ

# దివ్యాని

సుంకర వి. హనుమంతరావు



ఈ అయిదేళ్ల పరిచయంలో...'దివ్యాని'ని అలా అంత 'డల్'గా చూడడం ఇదే మొదటిసారి.

నేనా ఆఫీసులో చేరిన మొదటిరోజు నుంచే 'అది' నాకు క్లోజ్ ఫ్రెండ్ అయిపోయిందన్న విషయాన్ని... 'ఆఫీస్ స్టాఫ్' ఎవరూ నమ్మకపోగా- 'ఆ... తియ్యండి చాలు... ఈ మూణ్నాళ్ల ముచ్చట ఎన్నాళ్లో చూస్తాంగా?' అంటూ కొట్టిపారేశారు.

వాళ్ల కామెంట్స్‌కు మూల కారణం దివ్యాని ప్రదర్శించే దర్పమే అయ్యుంటుదని అనుకున్నాను. ఆఫీస్ జనాల అంచనాలను తారుమారు చేస్తూ... ఈ అయిదేళ్ల కాలంలో అత్యంత 'క్లోజ్' ఫ్రెండ్స్ అయిపోయామే తప్ప చిన్నపాటి ఆర్గ్యుమెంట్‌కు కూడా తావియ్యలేదు.

స్టయిలిష్‌గా వుండడం, ఎవర్నీ లెక్కచేయకపోవడం ఒక్కోసారి తన స్టేటస్‌ను ఎగ్జిబిట్ చేయడం...తన పర్సనల్ విషయాలుగా భావించానే తప్ప...మరేమీ ఆలోచించలేదు.

'దివ్యాని' డ్రైవింగ్ నేర్చుకొని...అప్పుడప్పుడూ తనే కారు డ్రైవ్ చేసుకుంటూ వస్తుంటే... ఆఫీస్ స్టాఫ్ అంతా 'నియోరిచ్' మహిమంటూ చెవులు కొరుక్కుంటుంటే వింటూ.. చిరునవ్వుతో తలూపానే తప్ప పట్టించుకోలేదు.

అందంగా...హుందాగా వుండే తనలోని ఓ చిన్న బలహీనతే అప్పుడప్పుడు నా హార్ట్‌ను టచ్ చేసేది.

దివ్యానికి బెగ్గర్సన్నా...క్రిపిల్డ్ పర్సన్స్ అన్నా అసహ్యం, చిన్నచూపు. ఆఫీస్ బాయ్ రామునైతే ఏనాడు పేరుపెట్టి పిల్చిన దాఖలాలు లేవు. ఎప్పుడూ ఏరా! 'టింకూ' అనే పిల్చేది.

తొలిరోజుల్లో తనేదో సరదాగా అంటోందేమో అనుకున్నాను. తర్వాత తెలిసింది. 'కుంటి' అనే పదాన్ని తిరగేసి పిలుస్తోందని. అయినా తనిష్టం తనదని సరిపెట్టుకున్నాను. పోలియో మూలంగా కుంటుకుంటూ నడిచే రాముని చూసినప్పుడల్లా బాధపడేదాన్ని. దివ్యానినెప్పుడూ ఆ విషయం గురించి అడగలేదు.

అలాంటి దివ్యానిని ఇటువంటి పొజిషన్లో చూడడం 'సంథింగ్ రాంగ్' అనుకుంటూ తన సీటు దగ్గరకెళ్లి...భుజం మీద చెయ్యేసాను. నా స్పర్శకు ఉలిక్కిపడిందే తప్ప తలెత్తి చూడలేదు.

తన ముందు కూర్చుంటూ ''ఏమైంది దివ్యా? ఏమైనా యాక్సిడెంట్ అయ్యిందా? డాలీతో ఏమైనా ప్రాబ్లమా?'' అని అడుగుతుంటే దాని మూడేళ్ల కూతురు డాలీ కళ్ల ముందు ఫ్లాషయ్యింది.

'డాలీ ఎంత క్యూటో...అంత నాటీ'

తనకు నచ్చిన వస్తువేదైనా వెంటనే ఇచ్చేయాలి. లేదా టపీమని కూర్చుండిపోయి 'ఐ వాంట్ దట్ మమ్మీ' అంటూ రాగయుక్తంగా పీకి పాకానపెట్టేస్తుంది.

ఏంటే!మౌనవ్రతం గాని... ఇంపోర్ట్ చేసుకున్నావా? అప్పుడు తలెత్తింది దివ్యాని. చాలా డిస్టర్బ్ అయిపోయినట్లు అదోలా వుంది.

ఓదార్పుగా తల మీద చెయ్యేసి 'నాతో కూడా చెప్పలేనంత సీరియస్సా? అనునయంగా అడిగాను.

'ఎందుకో చాలా దిగులుగా వుందే!'నెమ్మదిగా అంది.

అమ్మకు...మళ్లీ ఆస్తమా...?

కాదన్నట్లు తలూపింది.

'ఒక చిన్న సంఘటనకు ఇంత శక్తి వుంటుందనుకోలేదు''తనలో తనే అనుకుంటున్నట్లు అంది.

'నిజంగా నేనో ఫూల్‌నే... ఎవరు అంగవైకల్యంతో కన్పించినా చిన్న చూపుతో కామెంట్ చేసేదాన్ని'

'ఏదో...అదోసరదా...అంత మాత్రాన ఇలా కొంపలంటుకుపోయినట్లు..' నా మాటల్ని కట్ చేస్తూ....సీరియస్‌గా తన హ్యాండ్ బేగ్ తీసుకొని.....టాయ్‌లెట్ రూంకెళ్లిపోయింది.

'దీనికివ్వాళ ఏదో అయింది.' అనుకుంటుంటే ఫ్రెషప్ అయి వచ్చి 'నాతో రావే' అంటూ క్యాంటీన్‌కు దారితీసింది.

***

కూల్‌డ్రింక్‌ని సిప్ చేస్తూ... ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండానే...మొన్న రవికి ఫీవరొస్తే డాలీని డ్రాప్ చేయాలని నేనే డ్రైవ్ చేసుకుంటూ స్కూల్‌కెళ్లాను. ట్రాఫిక్ జాం మూలంగా అప్పటికే లేటయిపోయాం. కారు డోర్ తెరుస్తూండగానే ఓ పోలియో అబ్బాయి... 'మేడమ్!' అంటూ పాక్కుంటూ వచ్చేశాడు. అసలే...లేటయిపోయానన్న 'టెన్షన్' ప్లస్ క్రిపిల్డ్ పర్సన్స్ అంటే నాకున్న ఎలర్జీ... కొంచెం హార్ష్‌గానే పొమ్మని కసురుకొని లోపలికెళుతుంటే.... ఎదురుగా ఐస్‌క్రీం బండి. అంతే! 'మమ్మీ' ఐస్‌క్రీం అంటూ డాలీ గోల. 'నో...' అంటూ మేనేజ్ చేయాలని ట్రై చేసినా.... వినలేదది.... దాని స్టయిల్ తెలుసుగా...గేట్ ముందంతా దుమ్ము.... ఆరోజు ఫ్రైడే..వైట్ డ్రస్...కిందకు జారిపోతుంటే ఆపాలని చూశాను. వాచ్‌మన్ వచ్చి పట్టుకున్నా ఆగలేదది.'మమ్మీ...ఐస్ క్రీం' అన్న గోలే తప్ప నా మాట వినే స్థాయి దాటిపోయింది.

'అమ్మా! ఒకటి కొనిచ్చేయండి. నేను తీసుకెళ్లి క్లాస్ రూంలో దిగబెడతాను. వాచ్‌మెన్ సలహానే బెటరనిపించింది.

వాచ్‌మెన్ మాటలు వింటూనే... ఐస్‌క్రీం అబ్బాయి... ఓ 'కోన్' తీసి డాలీకిచ్చేసాడు. అది వాచ్‌మన్‌తో వెళ్లిపోయింది.

ఐస్‌క్రీం అబ్బాయికి మనీ ఇద్దామని నా హ్యాండ్ బ్యాగ్ ఓపెన్ చేసి చూసాను. అన్నీ ఫైవ్ హండ్రెడ్, థౌజండ్ నోట్లే తప్ప చిల్లర లేదు. ఐస్‌క్రీం అబ్బాయి చెయ్యి చాపి నిలబడ్డాడు.

చాలా ఆక్వర్డ్ పొజిషన్.

అప్పటికే చెమటలు పట్టేసాయి. ఇంట్లో 'చిల్లర' కనపడితే చీదరించుకునేదాన్ని. అప్పుడు తెలిసొచ్చింది చిల్లర విలువేంటో!

చిల్లర తెమ్మని అయిదొందల నోటు ఇవ్వబోయాను.

'అమ్మో! ఈ నోటు నాతాన చూసివుంటే... ఏడ దొంగతనం చేసినవ్‌రా బిడ్డా! అంటూ...పోలీసులు బొక్కలిరగతంతారు. అయినా ఈ పొద్దుగాల ఇంత పెద్ద నోటుకు చిల్లర యాడ దొరుక్కద్దమ్మా' అంటూ ఏడుపు ముఖం పెట్టాడువాడు.

'ఏం చేయాలి? అయితే రేపు ఇస్తాను.... ఓకేనా? అన్నాను.

'ఇప్పుడింటికెళ్లి బండి ఓనర్‌కి లెక్కివ్వకపోతే మక్కెలిరిగిపోతాయి. రేపు బండివ్వకపోతే బస్టాండులో ఇదిగో ఈడిలాగా ముష్టెత్తుకోవాల' పోలియో అబ్బాయిని చూపిస్తూ అన్నాడు.

అప్పుడు పరీక్షగా చూసాను...అబ్బాయిని...

రెండు కాళ్లూ పోలియోతో చచ్చుబడిపోయాయి. మట్టికొట్టుకుపోయిన బట్టలతో మరీ అసహ్యంగా అనిపించాడు. ముఖం తిప్పేసుకున్నాను.

కారులో వచ్చిన తల్లి దగ్గర ఇరవై రూపాయలు లేవా? నా చెవుల్లో పూలు పెట్టకమ్మా అనే లెవల్లో అనుమానంగా చూస్తున్నాడు. ఐస్‌క్రీం అబ్బాయి.


మేడం! పైసలివ్వండి...నే పోవాల....రేపెల్లుండి యిస్కూలు సెలవులు. యాడకు పంపిత్తాడో మా సేటు!

చెయ్యి చాపి నిలబడ్డాడు.

''ఇష్యూ చిన్నదే...సిట్యూయేషన్ ఆక్వర్డ్!''

'నిజంగా చిల్లరలేదు. మండే! నలభై రూపాయలిస్తా'

మేడం! గిసుంటి యవ్వారాలు మస్తు జూసిన. గిట్లనే ఏడుస్తుండనిగా..యిస్కోడాకార్ల వచ్చే తల్లికి అప్పుబెట్టిన. మర్నాడు పైసలు అడిగితే... మాకు అప్పుబెట్టినవ్‌రా లద్దు కొడకా...అంటూ ఆ యమ్మ మగడు మస్తు లొల్లిబెట్టిండు...మేడం...మీ నలభై రూపాయలకో దణ్ణం... నా పైసలిస్తే..నే బోతా...





'మేడం ఎవరైనా కావాలని ఇలాంటి కుంటిబతుకుల్ని కోరుకుంటారా? పిల్లలందరికీ... డాలీ పాపలాంటి మంచి బతుకులు దొరుకుతాయా? చెప్పండి మేడం! మమ్మల్ని ఆదరించి అక్కున చేర్చుకోమని కోరుకునేంత పిచ్చివాళ్లం కాదు మమ్మల్ని చూస్తేనే పాపం అన్నట్లు అసహ్యంతో ముఖాలు తిప్పేసుకోకుండా..కనీసం మనుషుల్లా..'

అల్లరి చేసే స్థాయికి పెంచాడు గొంతు.

నా గొంతులో తడారిపోయింది. ఎలాగో నోరిప్పి...అయితే ఇప్పుడేం చెయ్యమంటావ్? అడిగాను.

''నా పైసలు నాకిప్పించ్చున్రి.... నే బోవాల''

'నా దగ్గర చిల్లర లేదంటే నమ్మవే?' చిరాగ్గా అన్నాను.

'చిల్లర్లేనోళ్లు నా ఐస్క్రీం ఎందుకు తీసుకోవాల?' అంతకంటే చిరాగ్గా అన్నాడు వాడు.

''రేయ్! ఈ కార్ల తిరిగేటోళ్లంతా ఇంతేరా? రోడ్డు పక్క రూపాయి కనపడితే చాలు...కారు దిగి మరీ కక్కుర్తిపడి పోతారు. మా పెద్దయ్య చెప్పిండు' కసంతా వెళ్లగక్కాడు వాడు.

వాడి మాటలతో తల తిరిగిపోయిందనుకో–

డాలీ పీక నులిమేయాలన్నంత కోపం వచ్చేసింది.

సన్నగా...తలనొప్పి మొదలైంది. ఆ పరిస్థితిలో కన్నీళ్లొక్కటే తక్కువ. ఏం చేయాలా? అని ఆలోచిస్తూ కళ్లు మూసుకుని కారుకు ఆనుకుని అలానే నిలబడిపోయాను.

'అమ్మా! మేడం!' అని వినిపిస్తే కళ్లు తెరచి చూసాను.

నా కాళ్ల దగ్గర... ఆ పోలియో అబ్బాయి....చేతినిండా చిల్లరపట్టుకొని నన్నే చూస్తున్నాడు. ఏమన్నట్లు చూసాను.

'మేడం! ఈ ఇరవై రూపాయలూ ఆడికిచ్చేయండి. పైసలు తగ్గితే ఆడి సేటు బెల్టుతో కొట్టేస్తాడు'

ఆశ్చర్యంతో చూసాను.

''తీసుకోండి మేడం..కరెక్ట్గా ఇరవై రూపాయలున్నాయి'' గుప్పెట్లో వున్న రూపాయిల్ని చూపిస్తూ ప్రాధేయపడుతుంటే–

'ఒకే... వీడికి రేపో యాభై రూపాయలు ఇస్తే సరిపోతుందనుకొని...మట్టి కొట్టుకుపోయిన రూపాయల్ని ముట్టుకోవడం ఇష్టంలేక...

'నువ్వే ఆ అబ్బాయికి ఇచ్చేసేయ్. రేపే నీ పైసలు నీకిచ్చేస్తాను' అంటూ ఆ సంకట స్థితి నుంచి బయటపడిపోయాను.

'ఓ.... ఇంతేనా? చాలా చిన్న విషయమన్నట్లు తేల్చేసాను. తననా మూడ్ నుంచి బయటపడేయాలని.

'నేనూ నీ లాగే అనుకొని బోల్తాపడిపోయాను' చాలా విచారంగా చెప్పింది.

నాలో క్యూరియాసిటీ పెరిగిపోయింది. ఊహించడం కన్నా 'ఊ' కొట్టడం బెటరని దివ్యానినే చూస్తూ వుండిపోయాను.

'మండే స్కూలుకి వెళ్లాను. ఆ అబ్బాయి అక్కడే వున్నాడు. ఐస్క్రీం బండి కనిపించలేదు. పిల్లలంతా లోపలకి వెళ్లిపోయాక అతని దగ్గరకెళ్లి పర్స్ లోంచి యాభై రూపాయల నోటు తీసి ఇవ్వబోయాను.

ఆ నోటుని చూస్తూనే పాముని చూసి భయపడినట్లు వెనక్కి వెళ్లిపోయాడు.

'వద్దు మేడం... పసిపాప కోసం ఇచ్చినదాన్ని తిరిగిచ్చి... నన్ను బిచ్చగాడ్ని చేయకండి మేడమ్!'

'అదేంటి? ఆ డబ్బు నీదేగా?'

'కాదు మేడం... నాది కాదు. అమ్మానాన్నలు లేని అనాథల కోసం పోగుచేస్తున్న డబ్బిది.'

ఆశ్చర్యంగా చూస్తుంటే...

అమ్మతోడు మేడం! నిజంగా... ఆ డబ్బు నాది కాదు. అనాథ పిల్లల కోసం అడుక్కున్న డబ్బు. డాలీ పాప ఐస్క్రీం కోసం ఇచ్చిన ఇరవై రూపాయలూ మా అయ్యనడిగి... ఇందులో వేసేసాను.

నీకే కాళ్లు లేవు... నువ్వు?

ఏం ఫర్వాలేదు మేడం! నాకు కాళ్లు లేకపోయినా అన్నం పెట్టి పోషించే అమ్మానాన్నలున్నారు. మా స్లం ఏరియాలో అడుక్కుతినే చాలా మంది పిల్లలకు అమ్మానాన్నలు లేరు మేడం. వాళ్లకు ఓ పూటైనా తిండి పెట్టాలని ఇలా....

చెళ్లున కొట్టినట్లయింది.

'వేలాది రూపాయల జీతాలు తీసుకుంటూ, కార్లలో తిరుగుతూ రూపాయి దానం చెయ్యాల్సివస్తుందని మొగని సెల్తో బిజీగా వున్నట్లు నటిస్తూ...బతికేస్తున్న మనం నాగరికులం?'

దివ్యాని గొంతులో బాధ

'యస్' ఇదే.... ఇదే రియలైజేషన్ తనలో రావాలని... ఎప్పట్నించో కోరుకుంటుంటే... ఓచిన్న పోలియో అబ్బాయి...దాన్ని నిజం చేసాడు. హేట్సాఫ్ టు ద కిడ్' అనుకుంటుంటే...

ఏయ్...వీరీ! ఇంకా ఆ అబ్బాయి ఏమన్నాడో తెలుసా?

'మేడం ఎవరైనా కావాలని ఇలాంటి కుంటిబతుకుల్ని కోరుకుంటారా? పిల్లలందరికీ... డాలీ పాపలాంటి మంచి బతుకులు దొరుకుతాయా? చెప్పండి మేడం! మమ్మల్ని ఆదరించి అక్కున చేర్చుకోమని కోరుకునేంత పిచ్చివాళ్లం కాదు మమ్మల్ని చూస్తేనే పాపం అన్నట్లు అసహ్యంతో ముఖాలు తిప్పేసుకోకుండా..కనీసం మనుషుల్లా..'

నన్నే వేలెత్తి చూపుతున్నట్లు ఫీలయ్యాను. నేను రోజూ రామూనెంత గాయపరుస్తున్నానో తెలిసొచ్చింది. వీళ్లంతా శారీరకంగా వికలాంగులైతే... నేను మానసికంగా... యస్ మెంటల్లీ క్రిపల్డ్'

దివ్యాని గొంతు బొంగురుపోయింది.

ఏయ్ దివ్యా! పాస్ట్ ఈజ్ పాస్ట్ సానుభూతికన్నా చిరుసాయం గొప్పది. ట్రై టు డూ సంథింగ్ అన్నాను హ్యాపీగా.

'యస్ ఏదైనా చేయాలి' అనుకుంటూనే నేనున్నాననే సంగతే మర్చిపోయి...తిన్నగా తన కారు దగ్గరకి వెళ్లిపోయింది.

***

మర్నాడు ఆఫీస్కొస్తూనే... కనిపించిన దృశ్యాల్ని చూసి... అవాక్కై నిలబడిపోయాను. రాత్రికి రాత్రి ఎలా మేనేజ్ చేసిందో... రెండు బ్రాండ్ న్యూ ట్రైసికిల్స్ మెంట్ ఫర్ పోలియో ఎఫెక్టెడ్ పర్సన్స్... ఒక దాంట్లో రామూ కొత్త బట్టల్లో ఆనందంగా మెరిసిపోతుంటే... రెండో దాంట్లో మరో కిడ్. అతనే దివ్యకు షాకిచ్చిన పోలియో అబ్బాయిగా గుర్తించాను. అంతేకాదు. ఆ అబ్బాయి ఒడిలో డాలీ! మా స్టాఫ్ అంతా దివ్యానికి కంగ్రాట్స్ చెప్తుంటే... ఆనందంగా చూస్తూ అలాగే నిలబడిపోయిన నా దగ్గరకు వచ్చి ...

'సారీ నే వీరీ! నీక్కూడా చెప్పకుండా... నా పరిధిలో నేను చేయగలిగింది చేసాను. నా కిప్పుడెంత ఆనందంగా వుందో తెలుసా? అంటూ నన్ను కౌగిలిలో వుక్కిరిబిక్కిరి చేస్తూంటే... నన్ను చూస్తూనే కిందకు దూకి పరిగెత్తుకొచ్చిన డాలీ... నా కాళ్లకు అడ్డం పడిపోతూ... ఆ అబ్బాయిని చూపిస్తూ... ఈ అన్నయ్యను కూడా మమ్మీ.... మా స్కూల్లోనే చేర్పిస్తుందంట అంటుంటే... ఆపుకోలేని ఆనందంతో దివ్యానిని హృదయానికి హత్తుకుని దివ్యా! నువ్వు నిజంగా దివ్యానివేనే...యూ వార్ గ్రేట్.. అంటూ దాని చెంప మీద ముద్దు పెడుతుంటే..దివ్యాని కళ్లనుంచికారిన ఆనందబాష్పాలు..నా పెదాలకు అమృతంలా తగిలాయి.

''జాలి చూపే పెదాలు నావైతే
సాయమందించిన చేతులు దివ్యానివి''

అందుకే తన పేరు 'దివ్యాని'